తిరుమలాయపాలెం : పిండిప్రోలులో అమ్మవారి విగ్రహం వద్ద పూజలు

ఎర్రుపాలెం : జమలాపురంలో గాయత్రిదేవీ అలంకారం

మధిర : అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పలు రూపాల్లో అమ్మవారి దర్శనం

కూసుమంచి : మండల కేంద్రంలో అన్నపూర్ణదేవి అవతారం

చింతకాని : నాగులవంచలో దర్శనమిస్తున్న అమ్మవారు

సత్తుపల్లి : సరస్వతి ఆలయంలో అన్నపూర్ణాదేవిగా అవతారం

మా ప్లాట్లు ఇప్పించి.. న్యాయం చేయండి

- ఏనాడో అమ్ముకున్న భూమిని తిరిగి ఆక్రమించే ప్రయత్నం
- ఆక్రమణదారుడికి అండగా కాంగ్రెస్ కార్పొరేటర్
- తప్పుడు పత్రాలు సృష్టించి బెదిరిస్తున్నారు..
- ప్లాట్ల కొనుగోలుదారుల ఆవేదన

ప్లాట్లు కొనుక్కున్నట్లు రిజిస్ట్రేషన్ పత్రాలు చూపుతున్న యజమానులు

రఘునాథపాలెం, అక్టోబర్ 5 : తమ ప్లాట్లను ఆక్రమించేందుకు చూస్తున్న వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని ప్లాట్ల యజమానులు అధికారులను వేడుకున్నారు. శనివారం మండల కేంద్రం రఘునాథపాలెం వద్ద తమ ప్లాట్లను ఆక్రమించేందుకు వచ్చిన ఆక్రమణదారుడి ప్రయత్నాన్ని వారు అడ్డుకున్నారు. అనంతరం విలేకరులతో తమ గోడును వెళ్లబోసుకున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం అర్బన్ పరిధి మల్లెమడుగు రెవెన్యూ సర్వే నెంబర్ 186, 187లో రియల్ఎస్టేట్ వ్యాపారులు దొంతినేని కృష్ణరావు, చావా రాములు, హనుమంతరావు 2007-08లో వెంచర్ చేయడంతో ఖమ్మంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన అనేక మంది ప్లాట్లు కొనుగోలు చేశారు. ఈ ప్లాట్లకు ఎల్ఆర్ఎస్ కూడా చేసుకున్నారు. అయితే మొదటి పట్టాదారుడి మనుమడైన అనుముల రమేశ్ రెవెన్యూ రికార్డుల్లో లొసుగులను అడ్డుపెట్టుకొని ఆ భూమిని తన పేరు మీదకు మార్చుకున్నారు. ఇటీవల అట్టి భూమిని రహస్యంగా కన్వర్షన్ సైతం చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ప్లాట్ల కొనుగోలుదారులు 89 మంది కోర్టును ఆశ్రయించి ఇంజక్షన్ ఆర్డర్ పొందారు. ఈ క్రమంలో కోర్టు ఆర్డన్‌ను సైతం ఖాతరు చేయకుండా రమేశ్ శనివారం ఆ భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసేందుకు పనులు చేపట్టాడు. దీంతో ప్లాట్ల కొనుగోలుదారులు అక్కడి చేరుకొని ఫెన్సింగ్ రాళ్లను తొలగించారు. అయితే తనకు ఎంతో కొంత మొట్టజెప్పి సెటిల్‌మెంట్ చేసుకోవాలని ప్లాట్ల కొనుగోలుదారులను రమేశ్ బెదిరింపులకు గురిచేస్తున్నాడు. ఎన్నో ఆశలతో పైసా పైసా కూడబెట్టి కొనుగోలు చేసిన ప్లాట్లను భూమికి వారసుడిని అంటూ అధికార పార్టీ కార్పొరేటర్ అండతో దొడ్డిదారిన పత్రాలు సృష్టించి దౌర్జన్యంగా ఆక్రమించేందుకు వస్తున్నాడని బాధితులు వాపోయారు. దయచేసి ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని ప్లాట్ల యజమానులు వేడుకున్నారు.

నూకల నరేష్‌రెడ్డి కన్నుమూత

నివాళి అర్పించిన మంత్రి పొంగులేటి, మాజీ ఎమ్మెల్యే కందాల

నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి

కూసుమంచి, అక్టోబర్ 5: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నూకల నరేష్‌రెడ్డి అనారోగ్యంతో శుక్రవారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో తుదిశ్వాస విడిచారు. శనివారం ఆయన మృతదేహాన్ని మహబూబాద్ జిల్లా మరిపెడ బంగ్లా మండలం పురుషోత్తమయగూడెంలో తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామరెడ్డి, రాష్ట్ర ఇరిగేషన్ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడి, మాజీ ఎంపీ ఆర్ సురేందర్‌రెడ్డి పురుషోత్తమ యగూడెం వెళ్లి భౌతికకాయంపై పుష్పగుచ్చాలు ఉంచి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సంతాపం తెలిపిన మాజీ ఎంపీ నామా, తాతా మధు

ఖమ్మం, అక్టోబర్ 5 : నూకల నరేశ్‌రెడ్డి మృతి పట్ల శనివారం పలువురు నేతలు సంతాపం వ్యక్తం చేశారు. నీతి, నిజాయితీ, నిబద్ధత కలిగిన ఒక మంచి మిత్రుడిని కోల్పోయానని బీఆర్ఎస్ నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో టీఆర్ఎస్ పార్టీలో చేరి, పార్టీ కోసం ఎంతో కష్టపడ్డారని తెలిపారు. 17వ లోక్‌సభ ఎన్నికల్లో తన విజయానికి అహర్నిశలు కృషి చేశారన్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన ఆయన ప్రజల సంక్షేమానికి ఎంతో తోడ్పాటును అందించారని బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

ఖమ్మం, అక్టోబర్ 5 : అర్హత గల ప్రతి ప్రభుత్వ ఉపాధ్యాయుడు నవంబర్ 6వ తేదీలోపు వరంగల్- ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు అయ్యేలా పటిష్ట కార్యాచరణ చేపట్టాలని జిల్లా డిప్యూటీ ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వ విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు నవంబర్ 6లోపు ఫారం-19 ద్వారా ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు కోసం దరఖాస్తులు సమర్పించాలని కోరారు. 1 నవంబర్, 2024కు ముందు 6 సంవత్సరాల్లో కనీసం మూడు సంవత్సరాలపాటు సెకండరీ స్కూల్ కంటే తక్కువ స్థాయి కాకుండా విద్యాబోధనలో నిమగ్నమై ఉన్న ఉపాధ్యాయులు ఓటరుగా నమోదు కావడానికి అర్హులని తెలిపారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ లాజిస్టిక్ సేవల విస్తరణ

ఖమ్మం, అక్టోబర్ 5 : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు బస్టాండ్‌లకే పరిమితమైన లాజిస్టిక్ సేవలను గత నెలరోజుల్లో అన్ని ప్రాంతాలకు విస్తరించినట్లు లాజిస్టిక్స్ ఏటీఎంఏ పవన్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ లాజిస్టిక్స్‌లో అతి తక్కువ ధరలో బుక్ చేసుకుని వేగంగా, భద్రంగా పార్సిళ్లు పంపుకోవచ్చని సూచించారు. రాష్ట్రంలోనేకాక ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ముఖ్య పట్టణాలు, బెంగుళూరులో కూడా లాజిస్టిక్ సౌకర్యం ఉందని తెలిపారు. ఉమ్మడి ఖమ్మంజిల్లా వ్యాప్తంగా 35 లాజిస్టిక్ కేంద్రాలు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. సేవల కోసం ఖమ్మం : 9154298583, మధిర : 9154298582, సత్తుపల్లి : 9154298585, కొత్తగూడెం : 9154298587, భద్రాచలం : 9154298586, మణుగూరు : 9154298588 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సీబీఎస్ఈ క్లస్టర్స్ గేమ్స్‌లో హార్వెస్ట్ ప్రతిభ

జాతీయస్థాయికి ఎంపికైన బాలికల కబడ్డీ టీం

విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ రవిమారుత్

రఘునాథపాలెం, అక్టోబర్ 5 : సీబీఎస్ఈ క్లస్టర్స్ జోన్ గేమ్స్‌లో ఖమ్మం నగరం హార్వెస్ట్ విద్యార్థులు విజయదుందుభి మోగించారు. ఆంధ్రప్రదేశ్‌లోని తుని ప్రకాశ్ విద్యానికేతన్‌లో అండర్-19 బాలికల విభాగంలో జరిగిన కబడ్డీ పోటీల్లో సాయి వైష్ణవి ప్రథమస్థానంలో రాణించి బెస్ట్ రైడర్ అవార్డు అందుకుంది. హర్యానాలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. అంతేకాక బాచుపల్లిలోని వీఆర్ఎస్ విజ్ఞాన్ జ్యోతి రెసిడెన్షియల్ స్కూల్‌లో జరిగిన అండర్-19 బాలికల ఖోఖోలో పాఠశాల విద్యార్థులు సిల్వర్ మెడల్, బాలుర ఖోఖోలో బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకున్నారు. నల్గొండలోని అఖిల అడ్వాన్స్‌డ్ లర్నింగ్ స్కూల్‌లో జరిగిన అథ్లెటిక్స్‌లో అండర్-19 షాట్‌పుట్‌లో డీ నవ్య బ్రాంజ్ మెడల్, జోగులాంబ గద్వాల్ లోని శ్రీ విద్యానికేతన్ స్కూల్‌లో జరిగిన అండర్-19 బాలుర కబడ్డీ పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాదించారు. ఈ మేరకు క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులను శనివారం హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పీ రవి మారుత్, ప్రిన్సిపాల్ ఆర్ పార్వతీరెడ్డి అభినందించారు.

అంబరాన్నంటిన బతుకమ్మ సంబురాలు

బోనకల్లు : ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో..

కూసుమంచి : జేవీఆర్ కళాశాలలో బతుకమ్మ వేడుకలు

రఘునాథపాలెం : బొమ్మా కళాశాలలో బతుకమ్మ వేడుకలు

రఘునాథపాలెం : సర్వజ్ఞ పాఠశాలలో..

రఘునాథపాలెం : సిరి చైతన్యలో..

తిరుమలాయపాలెం : పిండిప్రోలు జూనియర్ కళాశాలలో..

సత్తుపల్లిటౌన్ : వాణి కళాశాల విద్యార్థినులతో బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే దంపతులు

సత్తుపల్లి : సాయిస్ఫూర్తి కళాశాలలో..

కారేపల్లి : మాణిక్యారంలో..

వేంసూరు : అంగన్‌వాడీ కేంద్రంలో

మధిర : శ్రీనిధి డిగ్రీ కళాశాలలో

వైరాటౌన్ : ఠాగూర్ విద్యాసంస్థలో

వైరాటౌన్ : న్యూలిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో..

చింతకాని : కోదుమూరులో..

వెంకటస్వామి(కాకా)కి నివాళి

ఖమ్మం, అక్టోబర్ 5 : స్వాతంత్ర్య సమరయోధుడు, కేంద్ర మాజీ మంత్రి స్వర్గీయ గడ్డం వెంకటస్వామి(కాకా) 85వ జయంతి సందర్భంగా మాల మహానాడు ఆధ్వర్యంలో ఖమ్మం నగరం రేవతిసెంటర్‌లో శనివారం ఆయనికి ఘనంగా నివాళి అర్పించారు. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమకారుడిగా, సింగరేణి బాంధవుడిగా, కార్మిక పక్షపాతిగా వెంకటస్వామి ఎనలేని సేవలు అందించారని దామళ్ల సత్యం ఆయన సేవలు కొనియాడి స్మరించుకున్నారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా కన్వీనర్ దామళ్ళ సత్యం, ప్రెసిడెంట్ పెరం మల్లయ్య, అధికార ప్రతినిధి గొట్టిముక్కల శ్రీను, మహిళా అధ్యక్షురాలు కొమరబత్తిన కాంతమ్మ, రాజు వెంకట్, రాములు, లక్ష్మి పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

రఘునాథపాలెం, అక్టోబర్ 5 : పెండింగ్ వేతనాలను చెల్లించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు శనివారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. గత ఐదునెలలుగా జీతాలు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నామని పేర్కొన్నారు. దసరా పండుగ సందర్భంగా పెండింగ్ జీతాలను తక్షణం విడుదల చేయాలని కోరారు. కలెక్టర్ అందుబాటులో లేనికారణంగా ఏవో అరుణకు వినతి అందజేశారు. గ్రామ పంచాయితీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పిట్టల మల్లయ్య, నాయకులు గుగులోతు రాందాస్, ప్రసాద్, సీతరాములు, భద్రు, సందీప్, సైదులు, లాలు, వీరన్న, వస్త్రాం, నరేశ్, సతీశ్ పాల్గొన్నారు.

సాయిగణేష్ నగర్‌లో అన్నదానం

ఖమ్మం రూరల్, అక్టోబర్ 5: దేవీ నవరాత్రుల్లో భాగంగా మండలంలోని సాయిగణేష్‌నగర్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి మండపం వద్ద నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కొనకల్ల సురేష్, ధరావత్ భీమా నాయక్, వినోద్‌కుమార్, రమణయాదవ్, లచ్చు నాయక్, నాగేంద్ర పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

బోనకల్లు, అక్టోబర్ 5: మండలంలోని పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పీసీసీ సభ్యులు పైడిపల్లి కిశోర్ డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కను కోరారు. శనివారం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను హైదరాబాద్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మండలంలో ఉన్న సమస్యలను వివరించారు. డిప్యూటీ సీఎంను కలిసిన వారిలో మాజీ జడ్పీటీసీ మోదుగు సుదీర్‌బాబు, మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, చొప్పకట్లపాలెం సర్పంచ్ సుబ్బారావు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కళాశాలకు ఫర్నిచర్ వితరణ

చింతకాని, అక్టోబర్ 5: మండల పరిధిలో నాగులవంచ జూనియర్ కళాశాలకు రూ.10వేలు గల ఫర్నీచర్‌ను వీవీసీ ట్రస్ట్ చైర్మన్ వంకాయలపాటి రాజా వితరణగా అందించారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో వీటిని అందజేశారు. కళాశాల సిబ్బంది, వంకాయలపాటి వీరయ్యచౌదరి ట్రస్ట్ బాధ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రుక్మిణియాదవ్‌కు సన్మానం

పెనుబల్లి, అక్టోబర్ 5: హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎనుముల రుక్మిణియాదవ్‌కు శనివారం హైదరాబాద్‌లో మనం ఫౌండేషన్ తరపున ఘన సన్మానం జరిగింది. కల్లూరుకు చెందిన ఎనుముల రుక్మిణియాదవ్ నాలుగు సంవత్సరాలుగా వినియోగదారుల హక్కుల సమాచార చట్టం, మహిళా హక్కులపై పలు ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ సేవలు అందిస్తున్నారన్నారు. ఆమె సేవలను గురించిన మనం ఫౌండేషన్ వారు సినీ హీరో నరేష్ చేతుల మీదుగా నగదు, ప్రశంసాపత్రం అందించి సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ బొడ్డుపాటి దాసు, తేళ్లూరి చిన్నయేసు, ఆదూరి కృష్ణవేణి, రెడ్డప్ప, చక్రవర్తి, అపర్ణ, అక్షయ పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

పెనుబల్లి, అక్టోబర్ 5: వణ్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో పెనుబల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణపై శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు పద్మశ్రీ వనజీవి రామయ్య చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పద్మశ్రీ వనజీవి రామయ్య వన సంరక్షణ, వన్యప్రాణి సంరక్షణపై ప్రసంగించారు. అనంతరం కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులు, కళాశాల యాజమాన్యంతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ యూసుఫ్, ప్రవీణ్‌కుమార్, జీ.ఉమా, ఎఫ్ఆర్ఓ సురేశ్, డీఆర్‌వో ఎఫ్ఎస్‌వో బీ.కాలు, ఎఫ్‌బీఓలు ప్రసాద్, మస్తాన్‌రావు, అరుణ, ఎస్.నాగరాజు, టీఏ అనిల్, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న వనజీవి రామయ్య, సిబ్బంది

డిజిటల్ కార్డుల ప్రక్రియ ప్రారంభం

సత్తుపల్లిటౌన్, అక్టోబర్ 5: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీ ప్రక్రియ బహుళ ప్రయోజనాలు కలిగిస్తుందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. శనివారం పట్టణంలోని 22వ వార్డులో డిజిటల్ కార్డుల పైలెట్ ప్రాజెక్టు ఎంపిక ప్రక్రియను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ఆర్డీవో రాజేంద్రగౌడ్, రెవెన్యూ సిబ్బంది, పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముత్తగూడెంలో రక్తదాన శిబిరం

ఖమ్మం రూరల్, అక్టోబర్ 5: మండల పరిధిలోని ముత్తగూడెం గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ పాషా పుట్టిన రోజు పురస్కరించుకొని సావిడి సెంటర్ వద్ద తలసేమియా వ్యాధి గ్రస్తుల నిమిత్తం శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బాబు, అంగడాల శ్రీను, పెద్ద అప్పరావు, లక్ష్మణ్, నాగేశ్వరరావు, మనోజ్, మహేష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

సబ్‌స్టేషన్ ఎదుట బంధువుల ఆందోళన

చింతకాని, అక్టోబర్ 5: విద్యుదాఘాతంతో రైతు గూని ప్రసాద్(57) మృతిచెందగా శనివారం కొదుమూరు సబ్‌స్టేషన్ ఎదుట మృతదేహంతో బంధువులు ఆందోళన నిర్వహించారు. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని లచ్చగూడెంలో రెండు రోజుల క్రితం వచ్చిన గాలిదుమారానికి భారీ వృక్షం కరెంట్ తీగలపై పడడంతో తీగలు తెగి వరి పొలంలో పడ్డాయి. శనివారం ఉదయం తన సోదరుని పోలానికి పురుగు మందు పిచికారీ చేయడానికి వెళ్ళిన గూని ప్రసాద్‌కు ప్రమాదవశాత్తు తెగిపడిన కరెంట్ తీగలు తగలడంతో విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడు. మృతుని సోదరులు గూని అప్పారావు, వెంకటేశ్వర్లు సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్‌ను నిలిపివేశారు. అనంతరం మృతదేహంతో కొదుమూరు సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించారు. విషయం తెలుసుకున్న విద్యుత్‌శాఖ డీఈ నంబూరి రామారావు, తహసీల్దార్ కూరపాటి అనంతరాజు, వైరా సీఐ సాగర్, ఎస్సై నాగుల్‌మీరా, ఏఈ వెంకన్న సబ్‌స్టేషన్ వద్దకు చేరుకొని మాట్లాడి కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. సబ్‌స్టేషన్ ఎదుట నిర్వహించిన ధర్నాకు గ్రామస్తులు, బంధువులు పెద్ద ఎత్తున చేరుకోవడంతో ఖమ్మం ఏసీపీ రమణారెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

బోనకల్లు, అక్టోబర్ 5: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని చొప్పకట్లపాలెంలో శనివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అమరబోయిన పాపారావు ఆలియాస్ ధనయ్య (32) కుటుంబ అవసరాల కోసం తీసుకొచ్చిన అప్పులు తీరక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాడు. కుటుంబ పోషణకు ఇబ్బందులు తలెత్తడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధుబాబు తెలిపారు. మృతదేహాన్ని మధిర ప్రభుత్వ ఆసుపత్రికి పంచనామా నిమిత్తం తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

యువకుడు ఆత్మహత్య

మధిర రూరల్, అక్టోబర్ 5: మండల పరిధిలోని నాగవరప్పాడు గ్రామంలో తాళ్లూరి బాబు(22) అనే యువకుడు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురై పురుగుమందు తాగి మృతిచెందాడు. తండ్రి ఏసుపాదం ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై లక్ష్మీభార్గవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదమని తెలిసినా ప్రయాణం..?

ప్రమాదకరంగా మధిర- అంబారుపేట రహదారి

ప్రమాదకరంగా మారిన రోడ్డు

మధిర, అక్టోబర్ 5: మున్సిపాలిటీ పరిధిలోని మధిర- అంబారుపేట చెరువు సమీపంలో రహదారి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇరువైపులా కోతకు గురై పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. అయినప్పటికీ ఈ మార్గం గుండానే పలు గ్రామాలకు వెళ్లే పరిస్థితి ఉండడంతో ప్రమాదమని తెలిసినప్పటికీ వాహనదారులు ప్రయాణాలు సాగిస్తున్నారు. రాత్రిపూట కొంచెం ఆదమర్చి ఈ మార్గం గుండా ప్రయాణిస్తే ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదాలు జరగక ముందే అధికారులు ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు, వాహనదారులు వేడుకుంటున్నారు.

యువకులకు క్రీడా సామగ్రి అందజేత

కారేపల్లి, అక్టోబర్ 5: మండల కేంద్రంలోని పలువురు యువకులకు శనివారం బీఆర్ఎస్ మైనార్టీ జిల్లా నాయకుడు షేక్ గౌసుద్దీన్ రూ.10 వేలు విలువైన క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యానికి దోహదం చేస్తాయని అన్నారు. కార్యక్రమంలో ఎం.డీ.కరీముల్లాఖాన్, చెవుల అనిల్, ఆదర్శ హరికృష్ణ, సద్దాంహుస్సేన్, ఆజాద్, సాంబ, కాసు, ప్రసాద్, జూపల్లి రాము, అబ్దుల్‌వాలే, బదీ, సుమంత్ పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం

వైరాటౌన్, అక్టోబర్ 5: వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్న మియాపురపు భవితకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా హంగర్ రిలీఫ్ కమిటీ సభ్యులు చింతోజు నాగేశ్వరరావు పుట్టినరోజు పురస్కరించుకొని రూ.10వేలను శనివారం ఎంఆర్‌కె టవర్ నందు ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ ఆధ్వర్యంలో అందించారు. చింతలపూడి వెంకటేశ్వరరావు, అబ్బూరి రమేష్, మరికంటి రాంగోపాల్, వనమా విశ్వేశ్వరరావు, కొమిరిశెట్టి శ్రీధర్, చెరుకూరు శ్రీనివాసరావు, హనుమాయమ్మ, కాపా గోపాలరావు పాల్గొన్నారు.

మెడికల్ విద్యార్థికి సహాయం

వైరాటౌన్, అక్టోబర్ 5: మున్సిపాలిటీ పరిధిలో దిద్దిపూడి గ్రామానికి చెందిన కొనకంచి జోజి, ప్రకాశం దంపతుల మనువరాలు పానెం హర్షితకు వైద్యవిద్య సీటు వచ్చింది. జోజి, ప్రకాశం దంపతులు తన ఇద్దరు మనువరాళ్ళను చాలా కష్టపడి చదివిస్తున్నాడు. హర్షితకు ఎంబీబీఎస్ సీటు రావడంతో వారి ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న వైరా ప్రాంతానికి చెందిన కట్టా కిరణ్ రూ.25వేలు, కట్టా శేఖర్ రూ.10వేలు రూ.35వేలు అందజేశారు. ముళ్ళపాటి సీతారాములు, మద్దెల రవి, కౌన్సిలర్ వనమా విశ్వేశ్వరరావు, కాపా మురళీకృష్ణ, సూర్యదేవర శ్రీధర్, కట్టా నరిసహారావు, కట్టా శేఖర్, కొత్తా నర్సింహారావు, పాటి రామకృష్ణ, దామినేని సత్యనారాయణ, గంజి సైదులు, కొత్తపల్లి నాగార్జున, గుజ్జర్లపూడి ఏసోబు , కొనకంచి ప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్టీసీ అమరులకు నివాళి

మధిర, అక్టోబర్ 5: పట్టణంలోని ఆర్టీసీ కార్మికుల యూనియన్ నేతల ఆధ్వర్యంలో ఆర్టీసీ అమరవీరులకు శనివారం నివాళి అర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శులు కే.అరుణకుమారి మాట్లాడుతూ.. 2019 అక్టోబర్ 5న ప్రారంభమై 55 రోజులు అనేక నిరసన కార్యక్రమాలతో సుదీర్ఘంగా సమ్మె సాగిందన్నారు. సమ్మెలో ఎందరో ఆర్టీసీ కార్మికులు అసువులు బాసారని, వారి త్యాగాలను కార్మికులు గుర్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాగుల్‌మీరా, ఎం.వెంకటేశ్వర్లు, కే.విష్ణువర్ధన్‌రావు, జేవీకే.రావు, ఆర్ఎస్.రావు, కేవీ.రెడ్డి, పీజే.రావు, నాగరాజు, ఇస్మాయిల్, కిశోర్‌కుమార్, బండి శ్రీను పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్త